PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

మంగళవారం 20-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :140 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
20-10-2026

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్

సూర్యాపేట, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా



అందిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్థానిక స్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను అక్కడే పరిష్కరిస్తే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 25 దరఖాస్తులు అందాయని, వాటిలో భూ సమస్యలకు సంబంధించి 12, రెవెన్యూ శాఖకు ఒకటి, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కి రెండు, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కి రెండు, ఇతర శాఖలకు సంబంధించి ఎనిమిది దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ఆయా దరఖాస్తులను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు ఆదేశాలు



మెదక్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 16 సాధారణ దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఏఓ యూనస్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రతిమా సింగ్ శుభాకాంక్షలు

మెదక్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలిచే బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగలను పురస్కరించుకుని మెదక్ జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపడంతోపాటు, జీవితంలో మరిన్ని విజయాలు సాధించేందుకు



దోహదపడాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.

మేడికుందా గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

వట్పల్లి, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మేడికుందా గ్రామ ప్రజలకు ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించిన రోజుగా, దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన సందర్భంగా విజయదశమిని జరుపుకుంటారని తెలిపారు. ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం, ధర్మబద్ధమైన జీవనం పట్ల నమ్మకాన్ని పెంపొందిస్తుందని అన్నారు. విజయదశమి సందర్భంగా ప్రతి ఒక్కరూ చెడు ఆలోచనలను విడిచిపెట్టి, మంచి మార్గంలో నడుస్తూ ప్రేమాభిమానాలతో జీవించాలని సూచించారు. గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

చింతకానిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

చింతకాని, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలు ఖమ్మం జిల్లా చింతకాని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామంలోని రామాలయం సెంటర్ సమీపంలో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని



నింపారు. గ్రామ మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు హాజరైన బిలీఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మేడంపూడి రమాజ్యోతి గ్రామంలోని పలువురు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు. అనంతరం మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిలారు జగన్ మోహనరావు, ఉప సర్పంచ్ దంపతులు కోలా ఉమారాణి, కోలా నాగేశ్వరరావు, విగ్రహ దాత బండి రమణ, స్థలదాత వెన్నబోయిన రాజు, వార్డు సభ్యులు కిలారు బాబురావు, షేక్ రహీమ్ తుల్లా, పొనుగోటి బాబు, గంధసిరి లలిత, వేముల ఆకాష్, నాయకులు బండి ప్రసాద్, మల్లెల సత్యనారాయణ, షేక్ జానీమియా, బండి వెంకటేశ్వర్లు, కొలుకుల వెంకటేశ్వర్లు, కానగాని బుచ్చయ్య, పొనుగోటి ప్రసాద్, పొనుగోటి చిన్న రత్నాకర్, జక్కి వీరబాబు, గంధసిరి శ్రీను, గడ్డం వెంకటేశ్వర్లు, కూచిపూడి సతీష్, బచ్చు బాబు, చింతల సైదులు, కొడవకంటి మోహన్ రావు, మేకనబోయిన రాంబాబు, ఉమారాజు, పోతురాజు గోపాల్ రావు తదితరులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు పల్లి గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్



వట్పల్లి, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని దరఖాస్తు పల్లి గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ కాలాలి సురేఖ సత్యనారాయణ గౌడ్ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రజల్లో ధర్మం, న్యాయం, ఐకమత్యం, సత్యం పట్ల నమ్మకాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. గ్రామ ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలతో, ఐకమత్యంతో విజయదశమి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సర్పంచ్ కోరారు.

దసరా పండుగ వేళ డప్పు కళాకారులకు నూతన వస్త్రాల అందజేత

- మరవెల్లి గ్రామంలో కళాకారులను ప్రోత్సహించిన మాజీ ఎంపీటీసీ తమ్మన్నగారి సంగన్న

మరవెల్లి, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ కోఆర్డినేటర్):

విజయదశమి పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన డప్పు కళాబృందానికి మాజీ ఎంపీటీసీ తమ్మన్నగారి సంగన్న నూతన వస్త్రాలను అందజేశారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే డప్పు కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆయన నూతన వస్త్రాలను అందించడం విశేషం. పండుగ వేళ కళాకారులకు వస్త్రాలు అందజేసి వారిపై తనకున్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. గ్రామీణ కళలను కాపాడుతూ, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో డప్పు కళాకారుల పాత్ర ఎంతో కీలకమని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు గ్రామీణ కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని



అన్నారు. దసరా పండుగ సందర్భంగా డప్పు కళాబృందానికి నూతన వస్త్రాలు అందజేసిన మాజీ ఎంపీటీసీ తమ్మన్నగారి సంగన్నను గ్రామస్తులు, పలువురు అభినందించారు.

జిలిపూర్ గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు



వట్పల్లి, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం బిజిలిపూర్ గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ శోభ, మాజీ ఎంపీటీసీ సదానందం, వార్డు సభ్యులకు, గ్రామ ప్రజలందరికీ సర్పంచ్ ప్రత్యేకంగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

రాంసాన్‌పల్లిలో మహిషాసురమర్దిని దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

-శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు ప్రత్యేక పూజలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం

అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా గ్రామస్తులు, భక్తులు



పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దివ్యదర్శనం చేసుకుంటూ ‘ఓం శ్రీ మాత్రే నమః’ మంత్రాన్ని జపించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సూచించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉపసర్పంచ్, అందోల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల పృథ్వీ సాగర్ రెడ్డి, పట్లోళ్ల మాజీ సర్పంచ్ సువర్ణ దామోదర్ రెడ్డి, శివారెడ్డి, కోరుబోయిన మాజీ సర్పంచ్ లక్ష్మి ఆగమయ్య, రాయిని శివచందర్, జోగిరెడ్డి, జోగేందర్, సారవర్మ, బోయిని గోపాల్, అంజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పాల్వంచ రవి, మల్లేశ్ గౌడ్, శంకర్, మొగులయ్య, లక్ష్మణ్, శివకుమార్, శ్రీనివాస్, గోపాల్, శంకు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కడారి మధు రెడ్డి, క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అరవింద్, సంజీవులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజ

- జమ్మి పూజ నిర్వహించి పోలీసు సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్, పోలీసు ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు చేసి పోలీసు అధికారులు, సిబ్బందికి జమ్మి ఆకులను అందజేస్తూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు వాహనాలకు సైతం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆయుధ పూజ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాహనాల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, విధుల్లో క్రమశిక్షణ, అప్రమత్తత, వృత్తిపరమైన నిబద్ధతను పాటించాలని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరికీ



సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతిసమృద్ధిని అందించాలని ఆకాంక్షించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, జార్జ్, కృష్ణమూర్తి, రామకృష్ణ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఎస్ఐ ప్రసాద్ మృతి

పోలీస్ శాఖకు తీరని లోటు.. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సంతాపం

మెదక్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



విధులకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఏఆర్ ఎస్ఐ ప్రసాద్ మృతి చెందడం తీవ్ర విషాదకరమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. ప్రసాద్ మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి మెదక్‌కు వస్తుండగా నర్సాపూర్--మెదక్ మార్గంలో ఆయన ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి స్కిడ్ కావడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఏఆర్ ఎస్ఐ ప్రసాద్ మృతి పట్ల ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి మృతి చెందడం బాధాకరమని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మృతుడి కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు

వరుసగా రెండో ఏడాది నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్ప అవార్డు

నారాయణఖేడ్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):





సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి 2026 సంవత్సరానికి కాయకల్ప ప్రశంసా పురస్కారం లభించింది. ఇప్పటికే 2025లోనూ ఈ అవార్డును సాధించిన ఆసుపత్రి, వరుసగా రెండో ఏడాది ఈ గుర్తింపు పొందడం విశేషం. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈ విజయం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పరిపాలనా, సహాయక సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, వైద్య వ్యర్థాల నిర్వహణ, అంటువ్యాధుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో మెరుగైన ప్రమాణాలను పాటించేలా ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కాయకల్ప కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవార్డు సాధనలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్, సబ్ కలెక్టర్ ఉమా హారతి అందించిన సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అవార్డు సాధనకు కృషి చేసిన ఆసుపత్రి సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ రమేష్ స్పష్టం చేశారు.

బ్రాహ్మణగూడలో ఘనంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన

- నిత్య పూజలు, ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం



హత్నూర మండలం, బ్రాహ్మణగూడ, అక్టోబర్ 20 (సందేశం):

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బ్రాహ్మణగూడ గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎర్రని పందిరి, పూలతో సుందరంగా అలంకరించిన మండపంలో కొలువుదీరిన దుర్గామాతకు ప్రతిరోజూ నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్నారు. గ్రామంలో భక్తిభావ వాతావరణం నెలకొనగా, గ్రామ యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో నిమగ్నమవుతున్నారు. భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

చెరువు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్

మానూర్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా మానూర్ మండల కేంద్రంలో కొద్ది రోజుల క్రితం జరిగిన విషాదకర ఘటనలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన మటురు నరసింహ రెడ్డి, కృష్ణవేణి, సంగమేశ్వర రెడ్డి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో బాధిత కుటుంబంలో నెలకొన్న విషాదాన్ని తెలుసుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుర్రపు మచ్చేందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఇలాంటి క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి మనోధైర్యం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజలకు కష్టసమయాల్లో అండగా నిలవాలనే లక్ష్యంతో జీఎంఆర్ ఫౌండేషన్ పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సాగర సంగం గౌరవ అధ్యక్షుడు, కృష్ణాపూర్ మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, మానూర్ సర్పంచ్ సిద్ధారెడ్డి,



రానాపూర్ సర్పంచ్ సంగారెడ్డి, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజు పటేల్, పిరెడ్డి, రాంరెడ్డి, మారుతి, మాణిక్రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విఠల్ రెడ్డి, నరసింహ రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

పల్నాడు అక్టోబర్ 19 (సందేశం టైమ్స్):

పల్నాడు జిల్లా సాతులూరులో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న రజినీకాంత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సాతులూరులోని చందవరం రైల్వే గేట్ సెంటర్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కట్టా వెంకటయ్య ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం రజినీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



రాంసాన్‌పల్లిలో ఘనంగా విజయదశమి ఉత్సవం

- ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల ప్రస్థానం.. 101వ సంవత్సరంలోకి అడుగు



అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్త శ్రీ పల్లె రమేశ్ మాట్లాడుతూ విజయదశమి పండుగ చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శ్రీరాముడు రావణుడిపై, దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాలు ధర్మం, ధైర్యం, న్యాయం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను చాటిచెబుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని అసూయ, ద్వేషం, అహంకారం, సోమరితనం వంటి దుర్గుణాలను విడిచిపెట్టి సద్గుణాలను పెంపొందించుకోవాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యతను గుర్తిస్తూ గ్రామ అభివృద్ధికి, దేశ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి విజయదశమి పండుగ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ పట్లోళ్ల శివారెడ్డి హాజరయ్యారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

తలెల్మాలో వివాహిత ఆత్మహత్య

- భర్త వివాహేతర సంబంధమే కారణమని బంధువుల ఆరోపణ

అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం తలెల్మా గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రతిభ (27) అనే వివాహిత ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త అర్జున్‌కు వివాహేతర సంబంధం ఉందనే మనస్తాపంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా మనూర్ మండలం దన్నారం గ్రామానికి చెందిన ప్రతిభకు సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం తలెల్మా గ్రామానికి చెందిన అర్జున్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే, భర్తకు వివాహేతర సంబంధం ఉందనే కారణంతో దంపతుల మధ్య కొంతకాలంగా కుటుంబ విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రతిభ ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న జోగిపేట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త వేధింపుల కారణంగానే ప్రతిభ ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు



చేపట్టారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ప్రతిభ మృతితో ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

నాగల్‌గిద్ద, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం మెగా నాయక్ తండాలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రహ్లాద్ నివాసంలో నిర్వహించిన దసరా వేడుకల్లో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుర్రపు మచ్చేందర్ పాల్గొని గ్రామ నాయకులు, స్థానికులతో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ వైద్య విద్యలో సీట్లు సాధించిన రాథోడ్ బాలాజీ, జాదవ్ అంబదాస్‌లను గుర్రపు మచ్చేందర్ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని



ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యలో రాణించడం ఎంతో సంతోషకరమని, వారి విజయాలు ఇతర యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధిస్తూ కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సాగర సంగం గౌరవ అధ్యక్షుడు, కృష్ణాపూర్ మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజు పటేల్, రాథోడ్ దిగంబర్, సుధాకర్ వాసుదేవ్, రఘు, సిరుపతి, తుకారాం, శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించి ఉన్నత విద్యలో ముందడుగు వేసిన విద్యార్థులను సన్మానించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాదేవి అవతారంలో అమ్మవారు.. ప్రత్యేక పూజలు నిర్వహించిన నోమన్నగారి మాధవరెడ్డి దంపతులు

అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో నవదుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా 8వ వార్డు సభ్యుడు నోమన్నగారి మాధవరెడ్డి, ఇంద్రజ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పురోహితులు అనంత్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి పట్టువస్త్రాలు, సువర్ణాభరణాలు, రంగురంగుల పుష్పాలతో శ్రీ దుర్గాదేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీహెచ్.



వెంకటేశం, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు ధీరజ్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, లక్ష్మారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ బరిలో 11 మంది అభ్యర్థులు

వైసీపీ నుంచి ముగ్గురు.. జనసేన నుంచి ఇద్దరు పోటీ

APSEC 2వ సాధారణ ఎన్నికలు - 2026
చిలకలూరిపేట పురపాలక సంఘం
అధ్యక్షుల అభ్యర్థుల వివరాలు
చిలకలూరిపేట పురపాలక సంఘం

క్రమసంఖ్య	అభ్యర్థి పేరు	పార్టీ పేరు	వయస్సు	కులం
1	రావు రామ తులసి	నవతరం పార్టీ	42	OC - తెలగ
2	డాక్టర్. ముప్పల్ల సైలజ చంద్ర	ఇండిపెండెంట్	65	OC - కామ్మ
3	ముక్కర అమాష	ఇండియన్ లేబర్ పార్టీ	35	SC - మాల
4	తోట రాజా రాజేశ్వరి	జనసేన	29	OC - తెలగ
5	తోట మాధవి	జనసేన	35	OC - తెలగ
6	షేక్ కరీమున్	YSRCP	52	BC - ఈ షేక్
7	సిద్ధభూతుని మేఘన	ఇండిపెండెంట్	23	BC - టి సూర్య బాలిజ
8	కందుల అంజలి	YSRCP	28	BC - బి గౌడ
9	షేక్ కరీమున్	ఇండియన్ నేషనల్ కాంగ్రెస్	53	BC - ఈ షేక్
10	షేక్ నజీరున్ బి	YSRCP	52	BC - ఈ షేక్
11	సనగల వెంకట లక్ష్మి	ఇండిపెండెంట్	41	OC - బ్రాహ్మణ

చిలకలూరిపేట (సందేశం టైమ్స్) అక్టోబర్ 20

చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పదవికి మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నుంచి ముగ్గురు, జనసేన పార్టీ నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్, ఇండియన్ లేబర్ పార్టీ, నవతరం పార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున పోటీ చేస్తున్నారు. మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కూడా మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పదవిపై ఆసక్తి నెలకొంది

ప్రజావాణికి 11 ఫిర్యాదులు

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ పాండు



సంగారెడ్డి, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ప్రాధాన్యతనిస్తూ, ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలపై అదనపు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. డివిజన్ల వారీగా సంగారెడ్డి నుంచి 3, నారాయణఖేడ్ నుంచి 1, జహీరాబాద్ నుంచి 2 ఫిర్యాదులు రాగా, కలెక్టరేట్ ప్రజావాణికి 5 ఫిర్యాదులు అందాయి. అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేరేడి గుంట గ్రామ ప్రజలకు విజయదశమి శు భాకాంక్షలు తెలిపిన పట్లోళ్ల వైద్యనాథ్ (రాజు పటేల్)



అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం నేరేడి గుంట గ్రామ ప్రజలకు విజయదశమి పండుగను పురస్కరించుకుని పట్లోళ్ల వైద్యనాథ్ (రాజు పటేల్) హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించిన రోజుగా, దుర్గామాత మహిషాసురుడిని సంహరించిన శుభ సందర్భానికి గుర్తుగా దసరా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో, సుఖశాంతులతో జీవిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. విజయదశమి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చెడును విడనాడి మంచిని ఆచరిస్తూ, ధర్మమార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
20-10-2026

సాయిపేట్ గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఉప సర్పంచ్

వట్పల్లి మండల్ , అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి)



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని సాయిపేట్ గ్రామ ప్రజలందరికీ గ్రామ ఉప సర్పంచ్ సామల మీనా చంద్రశేఖర్ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్తులో సాయిపేట్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

హర్షిత ఫిల్లింగ్ స్టేషన్‌లో అధిక ధరలకు పెట్రోల్ విక్రయాలు?

- వినియోగదారులపై అదనపు భారం.. సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్



జోగిపేట, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి):
సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 161 పక్కన ఉన్న హర్షిత ఫిల్లింగ్ స్టేషన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు పెట్రోల్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినియోగదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పెట్రోల్ కొనుగోలు సమయంలో అదనపు ధరలు వసూలు చేస్తున్నారంటూ పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి, పెట్రోల్ బంకులో ఇంధన ధరలు, విక్రయాల విధానం, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల అమలుపై సమగ్ర విచారణ చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఇంధనం విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి, వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాతర్లపాడులో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన సర్పంచ్ ఓబీనబోయిన లక్ష్మి అచ్చయ్య



చింతకాని, అక్టోబర్ 20(సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి):
ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ చివరి రోజు కావడంతో గ్రామంలోని మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, గ్రామ నడిబొడ్డున నిర్వహించిన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామమంతా పండుగ సందడితో కళకళలాడింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఓబీనబోయిన లక్ష్మి అచ్చయ్య మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. అనంతరం సర్పంచ్ లక్ష్మి అచ్చయ్య గ్రామ మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగులపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

వట్పల్లి (సందేశం టైమ్స్ ప్రతినిధి):
సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ నాగులపల్లి గ్రామం లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు నాగులపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులు రంగురంగుల ముగ్గులు, విద్యుత్ దీపాల అలంకరణలతో శోభాయమానంగా మారాయి. ఉదయం నుంచే గ్రామ మహిళలు, యువతులు గునుగు, తంగేడు, బంతి, చామంతి, గులాబీ తదితర రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం సంప్రదాయ వస్త్రధారణలో పూలతో అలంకరించిన బతుకమ్మలను తలపై ఎత్తుకుని గ్రామ కూడలికి చేరుకున్నారు. అక్కడ



బతుకమ్మలను మధ్యలో ఉంచి చప్పట్లు కొడుతూ, వలయాకారంలో తిరుగుతూ జానపద పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలంతా కలిసి బతుకమ్మ ఆడటంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువు వద్దకు తీసుకెళ్లి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. అనంతరం ఒకరికొకరు వాయనాలు, సత్తుపిండి, పలిపిండి ప్రసాదాలను పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు వేడుకల్లో పాల్గొని మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ వేడుకలతో నాగులపల్లిలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవం ప్రతిబింబించింది.

టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు మెదక్ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్--××) పోస్టుల భర్తీకి సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 200 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని వివరించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయానికి గేట్లు మూసివేస్తామని, అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా



కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, పుస్తకాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో యూనస్, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి

ఖమ్మం, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్):
ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలు,



ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల మధ్య వివాదాలకు సంబంధించి బాధితులు తమ ఫిర్యాదులను అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత పాటిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

కొత్త గొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):
సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని 8వ వార్డులో కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే పూల పండుగ అని పేర్కొన్నారు. హనుమాన్ నగర్‌లోని హనుమాన్ మందిరం నుంచి డప్పు వాయిద్యాల నడుమ బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్గమ్మ, పోచమ్మ మందిరాల ఆవరణలో సంబరాలు నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించిన



కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్‌ను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు, మహిళలు, యువతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోసానిపేట దుర్గాభవాని మాత ఆలయంలో ఘనంగా కుంకుమార్చన

అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ఉమ్మడి మీద జిల్లా కోఆర్డినేటర్):



అందోల్ మండలం పోసానిపేట గ్రామంలోని దుర్గాభవాని మాత ఆలయంలో సోమవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని గౌరమ్మను పూజించి కుంకుమార్చనలో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిపాటలు ఆలపించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు సహకరించగా, దుర్గాభవాని యూత్ కమిటీ సభ్యులు, పిల్లలు ముందుండి ఏర్పాట్లు చేసి కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేశారు. ప్రత్యేక పూజల అనంతరం మహిళలకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల భక్తిభావం, ఐకమత్యం మరింత పెరుగుతాయని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మకు బోనం..ఆనంద పర్వం

- కన్‌సాన్‌పల్లిలో ఘనంగా దుర్గమ్మకు బోనాలు
- సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా బోనాల ఊరేగింపులో మహిళ భక్తులు
- అందరినీ కట్టుకున్న చిన్నారుల ఆటపాటలు

అందోలు సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 20

సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దమైన బోనాల పండుగ సంబరం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నవదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బోనాల వేడుకను నిర్వహించారు. స్థానిక ఈశ్వరాలయం వద్ద బోనాల ఊరేగింపు ఏర్పాట్లు చేసి అక్కడి నుండి పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వరకు బోనాల ఊరేగింపు సాగేలా ఏర్పాట్లు చేశారు. మహిళ భక్తులు పెద్ద ఎత్తున బోనాల వేడుకల్లో పాల్గొని బోనాలను ఎత్తుకొన్నారు. చిన్నారులు సైతం మంగళహారతుల చేతబట్టి తమ భక్తిని



చాటుకున్నారు. డప్పు చప్పుల్లు, డిజే సౌండ్ భక్తి పాటల మధ్య ప్రారంభమైన బోనాల ఊరేగింపు ఆద్యాంతం వరకు అత్యంత వైభవంగా కొనసాగింది. బోనాలు ఆడపడుచుల నెత్తిన కిరీటంలా కనిపించాయి. బోనాల ఊరేగింపు గ్రామంలోని పురవీధుల గుండా బోనాల దీపాలు, మంగళహారతుల దీపాల వెలుగులు వీధులన్ని అందాన్ని సంతరించుకున్నాయి. బోనాలు వెలుగులు నింపినట్లుగా భక్తి పారవశ్యం ఉప్పొంగింది. దుర్గామాత మండపం వద్దకు చేరుకున్న బోనాలకు చిన్నారులు మంగళహారతులతో హారతులు ఇచ్చిన విధానం అక్కడున్నవారిని ఆకట్టుకోవడంతో పాటు బోనాల ఊరేగింపులోనే ప్రత్యేకతను సంతరించుకుంది. అనంతరం అమ్మవారి మండపం, పోచమ్మ దేవాలయం చుట్టు బోనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవార్ల దయతో గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలు, పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

ఉప్పొంగిన భక్తి పారవశ్యం..

దుర్గమ్మ తల్లికి నిర్వహించిన బోనాల ఊరేగింపు వేడుకలో మహిళలు సాంప్రదాయ పద్ధతిలో దుస్తులలో పాల్గొనడం గ్రామస్తుల్లో భక్తి పారవశ్యాన్ని నింపింది. డప్పు చప్పుల్లతో బోనాల ఊరేగింపు ముందుకు సాగగా అడుగడుగున ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ఇతర గ్రామాల నుండి ఆడపడుచులతో పాటు బంధువులు బోనాల ఊరేగింపు వేడుకల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి దయ తమపై ఉండి సుఖసంతోషాలను ప్రసాదించాలని అమ్మవారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ బద్ధంగా బోనాల వేడుకలను నిర్వహించడం పట్ల నవదుర్గా ఉత్సవ కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు
జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పీ.ఎస్.సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు (సీబీటీ) పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ (గ్రేడ్-××), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న పరీక్షలపై టీ.జీ.పీ.ఎస్.సీ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ (గ్రేడ్-××) పోస్టులకు సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 150 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ సమయాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్



ఫోన్లు, పుస్తకాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా యువజన క్రీడల శాఖ ఇన్‌చార్జి అధికారి అఖిలేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండేళ్ల డిప్లొమా కోర్సులు

మెదక్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026--2027 విద్యా సంవత్సరానికి అలైడ్ హెల్త్ (పారామెడికల్) కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల అదనపు డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ డాక్టర్ నితిన్ కుమార్ కాబ్రా తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థులు రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్ (ఎంఎల్టీ), డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (ఒఏటీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు మెదక్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కోర్సులకు సంబంధించిన అర్హతలు, ప్రవేశ విధానం తదితర పూర్తి వివరాల కోసం తెలంగాణ పారామెడికల్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను “తెలంగాణ పారామెడికల్ బోర్డు ఎ బ ్ స ్ ట ’ ’ (https://www.tgpmb.telangana.gov.in?utm_sourceRchatgpt.com) సందర్శించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 96669353777 నంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ నితిన్ కుమార్ కాబ్రా సూచించారు.

శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం.. గుడిమే హన్మంతు కుటుంబానికి అభినందనలు

నారాయణఖేడ్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామ శివారులో మంజీరా నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన 25 అడుగుల రేకుల షెడ్డును ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు గుడిమే హన్మంతు కుటుంబ సభ్యులు (ఎంఎస్‌డీ చిట్ ఫండ్స్) అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సమయంలో ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులు ఎండ, వర్షాల వల్ల ఇబ్బందులు పడకుండా ఈ షెడ్డు నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మించడం పట్ల ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు గుడిమే హన్మంతు కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, ఆలయ అర్చకులు శ్రీకాంత్ స్వామి, సిద్ధు స్వామి, నాగేష్ స్వామి, ప్రవీణ్ స్వామి, ఆలయ మాజీ చైర్మన్ మల్లయ్య, ఆలయ బృందం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల జీవితాల్లో విజయాల వెలుగులు నిండాలి

సాయిపేట్ గ్రామస్తులకు దసరా శుభాకాంక్షలు తెలిపిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొర్పోల్ విష్ణు

వట్పల్లి , అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి)



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయిపేట్ గ్రామ ప్రజలకు, యువతీ యువకులకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొర్పోల్ విష్ణు హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, విజయాలను నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామంలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సోదరభావంతో, ఐకమత్యంగా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువజన నాయకులు, గ్రామ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొనాలి

రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉప సర్పంచ్ పృథ్వి సాగర్ రెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలిపిన మన్నె పోచయ్య

అందోల్, అక్టోబర్ 20 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



విజయదశమి (దసరా) పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ సంగారెడ్డి జిల్లా NPRD ఇండియా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్, సందేశం టైమ్స్ న్యూస్ జర్నలిస్ట్, తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మన్నె పోచయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉప సర్పంచ్ పృథ్వి సాగర్ రెడ్డి తరపున కూడా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర ప్రజలందరూ విజయదశమి పండుగలను సుఖసంతోషాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతోప్రతికుటుంబంలో ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలజీవితాలలో సుఖశాంతులు నిండాలని కోరుకున్నారు .విజయదశమి పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొంటూ, ఈ పండుగలు ప్రజలజీవితాల్లో కొత్తవెలుగులునింపాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్యఐకమత్యం,సోదరభావం మరింత బలపడాలని, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండుగలను జరుపుకోవాలని హనుమంతు పృథ్వి సాగర్ రెడ్డి పోచయ్య కోరారు.

పోసానిపేట గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన రాములు. వెంకటేశం

అందోల్-పోసానిపేట:సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 20



సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని పోసానిపేట గ్రామ ప్రజలకు ఉప సర్పంచ్ రాములు, వార్డ్ మెంబర్ వి. వెంకటేశం విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర పండుగ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ వారు ప్రత్యేక సందేశాన్ని అందించారు. ?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించిన రోజుగా, అలాగే దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన సందర్భాన్ని పురస్కరించుకుని విజయదశమిని జరుపుకుంటామని తెలిపారు. ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం, ధర్మబద్ధమైన జీవనం పట్ల నమ్మకాన్ని పెంపొందిస్తుందని అన్నారు. విజయదశమి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చెడు ఆలోచనలను విడిచిపెట్టి, మంచి మార్గంలో నడుస్తూ ప్రేమాభిమానాలతో జీవించాలని సూచించారు. గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం చదవండి - నిర్భయంగా ఉండండి

ఆత్మీయ మిత్రుడు నివాసానికి ఆకస్మికంగా వెళ్ళిన మంత్రి తుమ్మల...

నమస్తే ఇందూర్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. అక్టోబర్ 19



ఆరోగ్యం ఎలా ఉంది... జాగ్రత్తగా ఉండు....
తన ఆత్మీయ మిత్రుడు నివాసానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ఆకస్మికంగా వెళ్ళినారు. జూలూరుపాడు టన్నల్ పనులను పరిశీలించటానికి వెళుతూ జూలూరుపాడు సమీపంలోని పాలకొల్లు గ్రామంలో నివాసం ఉంటున్న రోకటి రంగారావు నివాసానికి ఆకస్మికంగా వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాజకీయ రంగ ప్రవేశం నాటి నుంచి నేటి వరకు కూడా రంగారావు మంత్రి తుమ్మల తోనే ప్రయాణం సాగిస్తున్నారు. ఆరోగ్య రీత్యా మంత్రి తుమ్మలను కలవలేక పోతున్న రంగారావు నివాసానికి మంత్రి ఆకస్మికంగా వెళ్లడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులు లేకుండాపోయింది.మంత్రి తుమ్మలతో చాలాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల వెంట వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్ తో పాటు వైరా నియోజకవర్గ సీనియర్ నాయకులు, తుమ్మల అభిమానులు ఉన్నారు.

ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హామీల వైఫల్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

సందేశం టైమ్స్:



జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని వెల్గటూర్ మండలం పాశిగామ గ్రామానికి చెందిన యువకులు దాదాపు 50 కి పైగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయిందని పెద్ద ఎత్తున బీఆర్ఎస్ (బి ఆర్ ఎస్) పార్టీలో చేరారు.మాజీ మంత్రి, కొప్పుల ఈశ్వర్ సమక్షంలో కంటెం పవన్, కంటెం నవీన్,
ఎంబడి శ్రీధర్, గర్వందుల ఆశిష్, ఎంబడి వంశీ, కంటెం గౌరయ్య, అల్లం రమేష్ తో పాటు 50 మంది యువకులు బిఆర్ ఎస్ పార్టీ చేయడం జరిగింది ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువతకు కొప్పుల ఈశ్వర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్లూరి రామచంద్ర గౌడ్ మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ వర్మ జూపాక కుమార్ కొప్పుల సురేష్ అత్తే వెంకన్న కాండ్రపు. మహేష్ తాళ్ల కొత్తపేట్ సర్పంచి ద్యావనపల్లి సుధాకర్ నాయకులు ధ్యావన పల్లి ఎల్లయ్య కోటిలింగాల సర్పంచ్ పరిష కోటయ్య పుప్పారపు సతీష్ మెరుగు అశోక్ మరియు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు

శ్రీరాములపల్లె దుర్గా భవాని ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు

సందేశం టైమ్స్:



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామంలో శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న 30వ శరన్నవరాత్రుల వేడుకల్లో సోమవారం రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారుఈ సందర్భంగా మాజీ మంత్రి ఈశ్వర్ స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూప్రతి సంవత్సరం శ్రీ దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. అమ్మవారి దివ్య అనుగ్రహంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రితో పాటు సర్పంచ్ సల్లూరి శోభన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి జలేంధర్, ఉపసర్పంచ్ గడ్డం రాజేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు తాండ్ర ఆత్మచరణ్ రావ్, మాజీ సర్పంచ్ నేరెళ్ల గంగారెడ్డి, మాజీ ఎంపీపీ ఆవుల సత్యం మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోయపోతు గంగాధర్, కిషన్, మరియు వార్డు మెంబర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, మండలం బి ఆర్ ఎస్ నాయకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ప్రేమ వివాహం కాని నిత్యం నరకమే..రోదిస్తున్న భార్య

- బేటాలియన్ ఉద్యోగి పైశాచికత్వం..బలైపోతున్న భార్య
- బేటాలియన్ ఉద్యోగి రాక్షసత్వానికి భార్య బలవన్మరణాయత్నం
- ప్రభుత్వ ఆసుపత్రి బెడ్‌పై న బేటాలియన్ ఉద్యోగి భార్య ఆర్తనాదం
- అందంగా లేవంటూ బెల్టుతో విచక్షణారహిత దాడి.. లక్ష్మీదేవిపల్లిలో వెలుగు చూసిన భర్త పైశాచికత్వం!
- ఆసుపత్రిలోనే చంపేస్తానని బరితెగించిన భర్త లక్ష్మణ్
- న్యాయం చేయాలంటూ బాధితుల డిమాండ్

సందేశం టైమ్స్:

కొత్తగూడెం :కట్టుకున్న భార్యను కాపాడుకోవాల్సిన భర్తే పాలిట యముడిగా మారాడు. నిత్యం కంటికి రెప్పలా చూసుకోవాల్సిన వ్యక్తి రాక్షసంగా ప్రవర్తిస్తూ బెల్టుతో విచక్షణారహితంగా చితకబాదడమే కాకుండా కనీసం ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమెను అందరి సమక్షంలోనూ చంపేస్తానంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగాడు. భర్త అగాధాలు, మానసిక, శారీరక వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దారుణ సంఘటన కొత్తగూడెం ప్రాంతంలో తీవ్ర కలకలం రేపుతోంది.

అందంగా లేవంటూ మానసిక నరకం

బాధిత మహిళ పేర్కొన్న సమాచారం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్ నగర్ గ్రామ పంచాయతీ ప్రాంతంలో నివాసం ఉంటున్న బానోత్ పార్వతికి, చాతకొండ 6వ బేటాలియంలో ఉద్యోగిగా పనిచేస్తున్న లక్ష్మణ్‌తో



ప్రేమ వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొంతకాలంగా భర్త లక్ష్మణ్ తన భార్య పార్వతి పట్ల అత్యంత నరరూప రాక్షసుడిగా వ్యవహరిస్తున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. రోజూ ఏదో ఒక నెపంతో గొడవపడటం, బెల్టుతో శరీరంపై దారుణంగా కొట్టడం నిత్యకృత్యంగా మారిందని కన్నీరుమున్నీరవుతూ తెలిపింది. నువ్వు అందంగా లేవు అంటూ నిత్యం హేళన చేస్తూ ఇతర మహిళలను చూపిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని పేర్కొంది.

పిర్యాదు చేసినా మారని వైఖరి.. హత్యాప్రయత్నం

భర్త వేధింపులు మితిమీరడంతో గతంలోనే మహిళా సంఘాల ఆధ్వర్యంలో పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. అయితే ఆ కక్ష మనసులో పెట్టుకున్న లక్ష్మణ్.. గతంలో ఒకసారి ఆమె చేతులు వెనక్కి విరిచి దారుణంగా చంపేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించింది. పిల్లలను తన నుంచి శాశ్వతంగా దూరం చేసి ఇంట్లో నుంచి వెళ్లగొట్టేందుకు కుట్ర పన్నుతున్నాడని వాపోయింది. భర్త వేధింపులు తట్టుకోలేకే తాను ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టినట్లు పార్వతి స్పష్టం చేసింది.



ఆసుపత్రి బెడ్‌పైనే ఖాకీ ఉద్యోగి బరితెగింపు!

ఆత్మహత్యాయత్నం చేసిన పార్వతి ప్రస్తుతం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతోంది. ఇదే క్రమంలో బాధితురాలు ఆసుపత్రి బెడ్‌పై నరకయాతన అనుభవిస్తుంటే.. బేటాలియన్ ఉద్యోగి లక్ష్మణ్ ఆసుపత్రికి వచ్చి తోటి రోగులు, సిబ్బంది చూస్తుండగానే తీవ్రస్థాయిలో రెచ్చిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇక్కడే చంపేస్తా అంటూ బహిరంగంగానే బెదిరింపులకు దిగడం అక్కడున్న వారందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆసుపత్రిలోనే నలుగురి ముందూ అంత దారుణంగా బెదిరిస్తున్నాడంటే ఇంట్లో ఆ మహిళను ఏ స్థాయిలో వేధించి ఉంటాడో అర్థం చేసుకోవచ్చని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బేటాలియన్ విభాగంలో పనిచేస్తూ సొంత భార్యపైనే ఈ స్థాయిలో దౌర్జన్యానికి పాల్పడుతున్న లక్ష్మణ్‌పై బేటాలియన్ ఉన్నతాధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.నన్ను ఎవరు ఏమీ చేయలేరని ధీమాగా వ్య వ హరిస్తున్న భర్త లక్ష్మణ్.

16

పండుగ సాయన్న జయంతికి ముదిరాజులు అధిక సంఖ్యలో తరలి రావాలి

- తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ బోళ్ళ కరుణాకర్ ముదిరాజ్

సందేశం టైమ్స్:

ఈ నెల 22న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రాబిన్ హుడ్, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న జయంతికి జిల్లాలోని ముదిరాజ్ లు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ బోళ్ల కరుణాకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయనకార్యాలయంలో ప్రజావీరుడు, తెలంగాణ రాబిన్ ఫుడ్, బీసీల బంధువు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి గోడ పత్రికలు ముదిరాజ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో బడుగు బలహీన వర్గాల పై నాటి దొరలు, భూస్వాములు, సంపన్న వర్గాలు చేస్తున్న ఆకృత్యాలను ఎదిరించిన మహనీయుడు సాయన్న అని అన్నారు. నాటి



రోజుల్లో తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్న రోజుల్లో ధరలు, భూస్వాముల ధాన్యగారాలపై దాడులు చేసి ధాన్యం తీసుకువచ్చి బడుగు బలహీన వర్గాల ఆకలి తీర్చిన యోధుడన్నారు. సామాన్య ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను చూడలేక స్వంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసి నాడు ఆధిపత్యం చెలాయిస్తున్న వారిపై పోరాటాలు నిర్వహించిన యోధుడు సాయన్న అని గుర్తు చేశారు. అంతేకాకుండా అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా బహుజనులను ఐక్యం చేసిన సాయన్నను నాటి పెత్తందారులు ఎన్నో ఇబ్బందులకు గురిచేసి నిజాంపై ఒత్తిడి తీసుకువచ్చి అరెస్టు చేసి జైలు కు పంపిన 2 భయపడకుండా సామాన్య ప్రజల కోసం తన చివరి శ్వాస వరకు పోరాడారని అన్నారు. అలాంటి మహానేత ముదిరాజ్ సామాజిక వర్గంలో ఉండడం గర్వకారణమని చెప్పారు. సాయన్న జయంతి ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ మహానాయకుడు జయంతికి జిల్లాలోని ప్రతి ముదిరాజ్ ఇంటి నుండి ఒక్కొక్కరిగా తరలివచ్చి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెమ్మికల్ ముదిరాజ్ సొసైటీ చైర్మన్ జంగా వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఉపాధ్యక్షులు నార్ల రమేష్ ముదిరాజ్, గాంధీనగర్ ముదిరాజ్ సొసైటీ చైర్మన్ కోదాటి శ్రీను ముదిరాజ్, జిల్లా నాయకులు అంకిరెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, నీలం రాములు ముదిరాజ్, సందన బోయిన కిరణ్ ముదిరాజ్, భాష బోయిన పరమేష్ ముదిరాజ్, మట్టపల్లి వెంకన్న ముదిరాజ్, కన్నెబోయిన పుల్లయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో కరాటే క్రీడాకారిణి భుక్య శ్రీవిద్యకు ఘన సన్మానం

సందేశం టైమ్స్:



పాల్వంచ, రూరల్ కొత్త సూరారం:బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని పాల్వంచ మండలం కొత్త సూరారం గ్రామంలో సింగరేణి జూనియర్ కళాశాల తరఫున కరాటేలో రాష్ట్రస్థాయికి ఎంపికైన భుక్య శ్రీవిద్యను గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.కరాటే క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ విద్య అయిన కరాటే నేర్చుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ కోనే సూరిబాబు మార్గదర్శకత్వంలో కరాటేలో శిక్షణ పొందుతూ ప్రతిభ కనబరుస్తున్న భుక్య శ్రీవిద్య రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భుక్య జ్యోతి, మాజీ ఎంపీటీసీ భుక్య శంకర్, గ్రామ నాయకుడు భుక్య కిషన్ తదితరులు పాల్గొని భుక్య శ్రీవిద్యను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించేందుకు అవకాశం కలుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం చెబుతాం - నిర్భయంగా ఉంటాం

సీతారామ ప్రాజెక్టుతో రైతులకు సాగునీటి భరోసా

- మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి కృతజ్ఞతలు

సందేశం టైమ్స్:

దమ్మపేట మండలం గండుగులపల్లిలోని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులకు సకాలంలో సాగునీరు అందించి, పంటలు ఎండిపోకుండా చర్యలు చేపట్టినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ముందుచూపుతో చేపట్టిన చర్యల కారణంగా చెరువులు నిండుగా ఉన్నాయని, రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గాయని ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందడంతో రైతులు ఆనందంగా ఉన్నారని, వ్యవసాయ రంగ అభివృద్ధికి మంత్రి అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు.రైతుల సమస్యలపై మంత్రి ప్రత్యేక దృష్టి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సాగునీరు, తాగునీటికి సంబంధించిన సమస్యలను వివరించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేసుకోగలుగుతున్నామని రైతులు తెలిపారు. రైతుల సంక్షేమంపై మంత్రి చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ తమకు ఎంతో మేలు చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తుమ్మల నాగేశ్వరరావు వంటి నాయకుడు ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు.మహిళల సమస్యల పరిష్కారానికి హామీ అశ్వారావుపేట మండలంలోని మారుమూల ప్రాంతమైన ముసర్లగూడెం నుంచి వచ్చిన మహిళలు మంత్రిని కలిసి తమ గ్రామ సమస్యలను వివరించారు. వారి సమస్యలను తుమ్మల నాగేశ్వరరావు సావధానంగా విని, త్వరలో గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.దివ్యాంగుడికి పింఛన్ అందేలా చర్యలు పింఛన్ కోసం వచ్చిన ఓ నిరుపేద దివ్యాంగుడి సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తెలుసుకున్నారు. పూర్తిస్థాయి వైకల్యంతో ఉన్నప్పటికీ పింఛన్ ఎందుకు రావడం లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు వివరాలను పరిశీలించి, అర్హుడైన దివ్యాంగుడికి త్వరగా పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు దసరా పండుగ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గండుగులపల్లిలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి తరలివచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మంత్రి నివాసం సందర్శకులతో కిటకిటలాడింది.

ల్యాదెల్లలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న డా.పెసరు విజయచందర్ రెడ్డి

- హన్మకొండ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డా.పెసరు విజయచందర్ రెడ్డి



సందేశం టైమ్స్:

దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో చాలెంజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాలకు రెడ్‌క్రాస్ చైర్మన్, బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి డా.పెసరు విజయచందర్ రెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న చాలెంజ్ యూత్ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, పిట్టల రమేష్, మాందాటి శ్రీకాంత్, పిడుగు అనిల్, డెంగు నవీన్, సింధె శ్రీనివాస్, అన్నబోయిన రోహిత్, బత్తుల విశ్వంత్, ననబోయిన శ్రీనివాస్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరొక్కసారి కొత్త ఆసరా పెన్షన్ లబ్ధిదారులు మోసం చేసిన కాంగ్రెస్

- ప్రభుత్వం.....ఎం ఎం ఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల లత

సందేశం టైమ్స్:

స్థానిక పాల కేంద్రం ఏరియాలో మహాజన మహిళ మండలి ఎం. ఎం ఎం.ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల లత మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో గత కొద్ది రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్న లక్షలాదిమంది దివ్యాంగులను, వృద్ధుల ను, వితంతువులను ఒంటరి మహిళలను, గీత కార్మికులను మొదలగు ఆసరా పింఛన్ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు దసరా రోజున కొత్త పెన్షన్ మంజూరు చేస్తామని లబ్ధిదారుల ఎకౌంట్లో పెన్షన్లు జమ చేస్తామని తెలపడంతో లక్షలాదిమంది లబ్ధిదారులు 1000 కళ్ళతో ఎదురు చూశారని మహజన మహిళా మండలి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల లత అన్నారు. కానీ వారి ఆశలు నిరాశ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మరొకసారి వారిని మోసం చేయడం జరిగిందని,ఈ దసరాకి కొత్త పింఛన్లు పడతాయని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు తీవ్ర నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తపరిచారు.జూన్ 2 నుంచి కొత్త పింఛన్లు విడుదల చేస్తాం అంటూ పేపర్లలో,టీవీలలో ప్రకటనలకే పరిమితమవుతూ కాలం గడుపుతుంది అని అన్నారు.ప్రభుత్వం దసరా నాటి నుంచి కొత్త పింఛన్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని తెలుపడంతో అనేకమంది ఈనెల దసరా రోజు పెన్షన్ లు పడతాయని ఎంతో ఆశగా ఎదురు చూశారనీ కానీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పాత లబ్ధిదారులకు మాత్రమే ఆసరా పింఛను జమ చేయడం జరిగిందనీ కొత్త లబ్ధిదారులకు కనీసం ఆసరా పింఛన్ చేయడంలో ఈ కాంగ్రెస్



ప్రభుత్వం మరొకసారి నిర్లక్ష్యం వహించిందనీ పోయారు.ప్రభుత్వం వెంటనే కొత్త ఆసరా పింఛను లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని లబ్ధిదారుల తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులతోమహాజన మహిళ మండలి ఆధ్వర్యం లో ప్రజా పోరాటాన్ని నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పూజారి సుజాత, బర్ల దుర్గ, శేష కుమారి, పలివిల మంగ, యశోద ,సమ్మక్క, రాజు , అప్పారావు తదితరులు పాల్గొన్నారు
8

భవానీ అమ్మ ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సందేశం టైమ్స్:

దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా ధర్మపురి, మండలం పట్టణంలో శివాలయం, నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ హోమం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని భవానీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.అనంతరం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి మంజూరైన వేతన పెంపునకు సంబంధించిన పత్రాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సేవలను గుర్తిస్తూ తగిన ప్రోత్సాహం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో శ్రీనివాస్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, దేవాలయ మాజీ చైర్మన్ జక్కు రవీందర్ మరియు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి చల్లా ధర్మారెడ్డి

- నవరాత్రోత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సందేశం టైమ్స్:

ఆధ్యాత్మికతతో పాటు గ్రామీణ ఐక్యతను చాటిచెప్పే పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రోత్సవాల్లో సోమవారం ఉదయం ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం



ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ దైవభక్తితో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామస్తుల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని అన్నారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని, గ్రామాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యాలు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ దుర్గామాత దీక్షాపరులు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి దాడిలో తొమ్మిదేళ్ల బాలిక మృతి

సందేశం టైమ్స్:

సూర్యాపేట జిల్లా కోదాడలో ఈరోజు దారుణం చేసుకుంది. కన్నతల్లి దాడిలో తొమ్మిదేళ్ల చిన్నారి జాస్మిన్ మృతి చెందింది. ఆడుకుంటున్న బాలికపై తల్లి రాయితో దాడి చేసినట్లు ప్రాథమిక సమాచారం. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి. తల్లి సైరాబానుకు మానసిక సమస్యలు ఉన్నట్లు బంధువుల వెల్లడి భర్తకు దూరంగా బంధువుల ఇంట్లో ఉంటున్న తల్లి, కుమార్తె. మేనమామ ఫిర్యాదుతో కేసు నమోదు ఘటనపై దర్యాప్తు చేస్తున్న కోదాడ పట్టణ పోలీసులు.



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ వార్డులో అమ్మవారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం

సందేశం టైమ్స్:

సూర్యాపేట పట్టణంలోని 9వ వార్డులో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని, ఈరోజు అమ్మవారి మండపం వద్ద భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ శ్రీమతి పెరుమాళ్ల అన్నపూర్ణ , పెరుమాళ్ల శ్రీనివాస్ పాల్గొని, అమ్మవారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాలు అనేవి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించే పవిత్రమైన రోజులు. ఈ పవిత్ర సందర్భంలో అమ్మవారి మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో విశేషమైనది. భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించడం ద్వారా భక్తి, సేవాభావం, మానవత్వం వంటి గొప్ప విలువలను చాటుకున్నారు.అమ్మవారి కృపాకటాక్షాలు 9వ వార్డు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

